క్లుప్తంగా

ఐసీయూలో ఉన్న రోగికి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ ఉదయ్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట 316 సచివాలయం సి17 క్లస్టర్‌కు చెందిన వలంటీర్ ఉదయ్‌కుమార్ శభాష్ అనిపించుకున్నాడు. క్లస్టర్ పరిధిలో ఉన్న లబ్ధిదారు ఎం.అప్పారావు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకుని ఉదయ్‌కుమార్ శుక్రవారం అక్కడకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశాడు. 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' తో హార్ట్ ఆపరేషన్ చేయించుకున్న తనకు 'వైఎస్సార్ పెన్షన్' ఎంతో ఆసరాగా నిలిచిందని అప్పారావు పేర్కొన్నారు.

జాకబ్ రాజ్‌కు పురస్కారం



జాకబ్ రాజ్‌కు షీల్డు అందిస్తున్న పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ సభ్యులు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు

గోపాలపట్నం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ డాక్టర్ జాకబ్‌రాజ్‌కు గురువారం ప్రతిభా పురస్కారం అందించింది. ఈయన గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో నివాసముంటున్నారు. చిత్రకళ విభాగంలో ఆయన ఈ పుస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జాకబ్‌రాజ్‌కు ప్రశాంతినగర్ వాసులు అభినందనలు తెలిపారు.

22 సార్లు రక్తదానం



22వ సారి రక్తదానం చేస్తున్న శ్రీనివాస్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త పోతబత్తుల శ్రీనివాస్ 22 సార్లు రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నాడు. ఎనిమిదేళ్ల నుంచి ఆపదలో ఉన్న వారికి తన రక్తం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. బాధితులు ఏ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారో తెలుసుకుని.. అక్కడికి వెళ్లి రక్తదానం చేస్తుంటాడు. ఈక్రమంలో శ్రీహరిపురానికి చెందిన ఓ వ్యక్తి కేజీహెచ్‌లో వారం రోజులుగా చికిత్స పొందుతున్నాడు. అతడికి రక్తం అవసరమని వైద్యులు చెప్పడంతో.. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి 22వ సారి రక్తదానం చేసి అందరి మన్ననలు పొందాడు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఇల్లే ప్రకృతి వనం

- పెరటి తోటలపై పెరుగుతున్న ఆసక్తి
- పూలు, పండ్లు, అలంకార మొక్కల పెంపకం
- ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఇంటిని ప్రకృతి వనం చేసే మొక్కల పెంపకంపై పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటి వద్ద వివిధ రకాల మొక్కలు పెంచుతూ పరిసరాలను అందంగానే కాకుండా ఆరోగ్యంగా మార్చుకుంటున్నారు. ఒకప్పుడు ఆనందం, ఆహ్లాదం, ఆరోగ్యం కోసం పార్కుల వెంట పరుగులు తీయాల్సి వచ్చేది. ఇపుడు ఎవరికి వారు తమ ఇంటి పెరటినే అందమైన ఉద్యానవనంగా తీర్చిదిద్ది అంతకంటే ఆహ్లాదాన్ని పొందుతున్నారు.

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు తమ ఇంటి ఆవరణాన్ని అందమైన తోటగా మలిచి ఆనందంతోపాటు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. వివిధ రకాల పూలు, పండ్లు, అలంకార మొక్కలను పెంచుతూ పచ్చదనాన్ని పెంపొందిస్తున్నారు. తమ శేషజీవితాన్ని వాటికే అంకితం చేస్తున్నారు. మొక్కల పెంపకం వల్ల వ్యాయామం చేసినట్లవుతుందని, స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందని వారు చెబుతున్నారు.

భరత్‌నగర్‌లో పచ్చని పొదరిల్లు



భరత్‌నగర్‌లోని శ్రీనివాసరావు ఇంటి మేడపై పెంచుతున్న ద్రాక్ష పొదులు, ఇతర మొక్కలు

జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం భరత్‌నగర్‌లో బీఎస్ఎఫ్ రిటైర్డ్ ఉద్యోగి పూజారి శ్రీనివాసరావు స్థిరపడ్డారు. తన ఇంటినే పచ్చని పొదరిల్లులా మార్చేశారు. ఇంటి డాబాపై పలు రకాల పండ్ల మొక్కలు పెంచుతూ శభాష్ అనిపించుకున్నారు. డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, పైనాపిల్, జామ, మామిడి వంటి మొక్కలను పెంచుతున్నారు. ఇపుడు వాటిలో కొన్ని తొలగించి కొత్త మొక్కలు నాటుతున్నారు. ఇందుకోసం ఉదయం, సాయంత్రం వేళల్లో సమయాన్ని వెచ్చించి చంటిబిడ్డల్లా వీటిని సాకుతున్నారు.

ఏపీఎస్ఈబీ కాలనీలో ఆకర్షణీయ మొక్కలు



ఏపీఎస్ఈబీ కాలనీలోని రమేష్ ఇంటి ఆవరణలో ఆకర్షిస్తున్న మొక్కలు, కొలువుదీరిన బుద్ధుడు

హెచ్‌పీసీఎల్‌లో సీనియర్ మేనేజర్‌గా అల్లు రమేష్ రిటైరైన తవారుత ఏపీఎస్ఈబీ కాలనీలో స్థిరపడ్డారు. ఆయన ఇంటి ఆవరణలో పలు మొక్కలను పెంచి అందంగా తీర్చిదిద్దారు. ఇంటి చుట్టు వేలాడేలా వాటిని సుందరగా ఏర్పాటు చేశారు. మేడపై గోశాల్లో పలు ఔషధ మొక్కలను పెంచడం ప్రారంభిస్తున్నారు. కొంత మందిని చూసి ప్రేరణతోనే ఇలా మొక్కలను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో చూడముచ్చటగా..



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లోని విష్ణుమూర్తి ఇంటి ఆవరణలో అందమైన మొక్కలు

ఎన్ఎస్‌టీఎల్ రిటైర్డ్ టెక్నికల్ అధికారి గిలకల విష్ణుమూర్తి లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో నివసిస్తున్నారు. ఆయన ప్రవృత్తి బాడీ బిల్డింగ్. ఉద్యోగ సమయంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో బహుమతులు పొందారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాడీ బిల్డింగ్ మీట్‌లో మూడో స్థానం దక్కించుకున్నారు. ఇప్పటికీ కూడా తన ఫిట్‌నెస్ కోసం ప్రతి రోజూ వ్యాయామం చేయడం దినచర్యగా మారింది. ప్రస్తుతం తన ఇంటి అతి తక్కువ ఆవరణలోనే మొక్కలను పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉదయం, సాయంత్రం కొంత సమయం వెచ్చిస్తున్నారు.

మొక్కల పెంపకం సంతోషకరం



ఇంటి ఆవరణలో మొక్కలను పెంచడం సంతోషంగా ఉంది. ఇది నాకు ముందు నుంచే అలవాటే. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ఇంట్లో వచ్చిన వ్యర్థాలతోనే వర్మీ కంపోస్టు చేసుకుని వాడుతుంటాను. అందుకే ఇక్కడి మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. వర్మీ కంపోస్టు తయారీపై తర్ఫీదు ఇస్తాను.

– పూజారి శ్రీనివాసరావు, భరత్‌నగర్



పూత దశకు వచ్చిన డ్రాగన్ ఫ్రూట్ మొక్క

కొందరి ప్రేరణతో ప్రారంభించా..



కొంత మంది ప్రేరణతోనే ఇంటి ఆవరణలో మొక్కలు పెంచడం ప్రారంభించారు. వీటిని సాకడం దినచర్యగా మారింది. కళకళలాడుతూ మొక్కలు కనిపిస్తుంటే ఆనందంగా ఉంటుంది. ఇంట్లో వాతావరణం బాగుంటుంది. రకరకాల మొక్కలు ఆరోగ్యానికి, ఆనందానికి దోహదపడతాయి.

– అల్లు రమేష్, ఏపీఎస్ఈబీ కాలనీ

ఇంటి రూపురేఖలు మారాయి



మొక్కల పెంపకం వల్ల మా ఇంటి వాతావరణమే మారిపోయింది. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటాను. అందం, ఆరోగ్యాన్ని ఇచ్చే మొక్కలు పెంచుతున్నాను. మొక్కలు అంటుకట్టి అడిగిన వారికి ఉచితంగా ఇస్తున్నాను. ఇంట్లో ఏమాత్రం స్థలం ఉన్నా మొక్కలను పెంచాలని కోరుతున్నాను.

– గిలికల విష్ణుమూర్తి, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్

యోగాతో ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న న్యాయవాది విశ్వనాథ్‌రాజు

మల్కాపురం: యోగా మనిషిని ఆరోగ్యవంతంగా ఉంచుతుందని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తుందని న్యాయవాది విశ్వనాథ్‌రాజు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం మల్కాపురం శాఖ గ్రంథాలయలో చిన్నారులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. అతిథిగా ఆయన మాట్లాడుతూ యోగా ఒత్తిడిని జయిస్తుందని, పలు వ్యాధులను దూరం చేస్తుందన్నారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే వైద్యుడి వద్దకు వెళ్లనవసరం లేదని చెప్పారు. చిన్నతనం నుంచే యోగాపై పిల్లలు మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకుడు బి.సత్యానందం, రచయిత కె.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నీతి కథలతో క్రమశిక్షణ



పుస్తక పఠనంలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో కథలు చదవడం, రాయడం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక ప్రదర్శనలో భాగంగా బాలసాహిత్యం పుస్తకాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే పుస్తకాలను చదివించారు. సచివాలయ మహిళా పోలీస్ ఎం.భాగ్యశ్రీ, వెల్ఫేర్ అసిస్టెంట్ హరిత చంద్రిక, రిసోర్స్ పర్సన్‌లు మాట్లాడారు. నీతి కథలు చదవడం వల్ల విద్యార్థుల్లో పెద్దలపై గౌరవ భావాలు పెరగడంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ధనలక్ష్మీదేవి, దుర్గమాంబలకు ప్రత్యేక పూజలు



ధనలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ధనలక్ష్మీ దేవివి ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గాదేవికి ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీ సభ్యులు, సేవా దళం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేతన ఒప్పందంపై సమావేశం ఏర్పాటు చేయాలి



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం సంజీవరావుతో చర్చిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతన ఒప్పందంపై యాజమాన్యంతో సత్వరం సమావేశం ఏర్పాటు చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావును యూనియన్ నాయకులు శుక్రవారం కలిసి, చర్చలు జరిపారు. మే 16న జరిగిన ఉక్కు అడ్మిన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో హెచ్ఆర్ అధికారులు నెలలోగా ఉన్నత యాజమాన్యంతో వేతన ఒప్పందం గురించి సమావేశం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. వేతన ఒప్పందం జాప్యం వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని నాయకులు జీఎంకు తెలియజేశారు. సత్వరం వేతన ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారని, సాధ్యమైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, శ్రీనివాసరావు, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ప్రారంభం



జట్లను పరిచయం చేసుకుంటున్న సీపీ

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో బాలుర విభాగంలో 12 జట్లు, బాలికల విభాగంలో ఆరు జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీల్లో సత్తాచాటిన బాలబాలికలను జిల్లా జట్లుగా ఎంపిక చేసి ఈనెల 29 నుంచి నూజివీడులో జరిగే అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు పంపనున్నారు. ఈ సందర్భంగా పోటీలను నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ ప్రారంభించి జట్లను పరిచయం చేసుకున్నారు. అతిథిగా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ హాజరు కాగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్షణమే దహన ఖర్చులు చెల్లించండి

అల్లిపురం: జీవీఎంసీ రెగ్యులర్ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు తక్షణమే దహన ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు చెల్లించేలా జీవీఎంసీ కమిషనర్ సీహెచ్ సాయికాంత్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ రామారావు, ప్రధాన కార్యదర్శి నరసింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఉద్యోగి చనిపోయి సంవత్సరం గడిచిపోయినా దహన ఖర్చులు అందక వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యేవారన్నారు. ఈ విషయాన్ని కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి యూనియన్ నాయకులు తీసుకురావటంతో, తక్షణమే స్పందించిన ఆయన హెచ్‌వోడీలకు లక్ష రూపాయలు చొప్పున అడ్వాన్స్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారన్నారు.

జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించాలి

మురళీనగర్: హయ్యర్ వేజ్ పింఛన్ కోసం సభ్యులు, పెన్షనర్లు జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించుకోవాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్–2 పవన్‌కుమార్ జాస్తి ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈపీఎఫ్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ నుంచి వచ్చిన సర్క్యులర్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ 1995 సంబంధించిన పింఛన్‌దారులు అధిక పింఛన్ కోసం యాజమాన్యంతో కలిపి జాయింట్ ఆప్షన్ ఫారాలను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపించాల్సి ఉంటుందన్నారు. https:// unifiedportal& mem. epfindia. gov. in వెబ్‌సైట్‌లో ఫారాలు పంపించుకోవాల్సి ఉంటుందన్నారు.

పోలీసుల అదుపులో దత్తపవర్

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి ఒడిశాకు పిస్టల్‌ను తరలించేందుకు సహకరించిన దత్తపవర్‌ను ఫోర్త్ టౌన్ పోలీసులు మహారాష్ట్ర నుంచి నగరానికి శుక్రవారం తీసుకొచ్చారు. శ్రీధర్ హరికిషన్ పఠాంగికి పిస్టల్ ఇచ్చి పంపిచవలసిన అవసరం ఏంటని విచారణ చేపట్టారు. ప్రస్తుతం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో పిస్టల్ ఇచ్చిన వ్యక్తిని పూరిలో ఉన్న వ్యక్తి ఎవరు..? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

పది లఘు చిత్రాల ప్రదర్శన

సీతంపేట: 'ప్రపంచ మేధో సంపత్తి మహిళలు' అనే అంశంపై గత ఏప్రిల్‌లో జెనీవాలో జరిగిన లఘు చిత్రాల పోటీల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన వాటిని శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో పనిచేస్తున్న డాక్టర్ నీలిమ ఏటికొప్పాక బొమ్మలపై రూపొందించిన లఘు చిత్రానికి రెండో స్థానం దక్కిందని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన లా యూనివర్సిటీ వీసీ పి.సుధ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వాలు, సమాజంపై సహకరించవలసిన బాధ్యత ఉందన్నారు. మేధో సంపత్తి ఏ ఒక్కరికీ పరిమితం కాదని, అవి ప్రదర్శించడానికి సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా సుధను ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు ఎస్.ఎ.డి.పాల్, సంయుక్త కార్యదర్శి బి.చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, కార్యవర్గ సభ్యులు అనూరాధ, మూర్తి, ఆర్.శివకుమార్, సామాజిక కార్యకర్త బి.రమాప్రభ పాల్గొన్నారు.

'ఈసీహెచ్ఎస్ కార్డులు మార్చుకోవాలి'



మాట్లాడుతున్న మాజీ సైనికోద్యోగులు

అగనంపూడి: మాజీ సైనికోద్యోగులు తమ పాత ఈసీహెచ్ఎస్ కార్డులను మార్చుకోవాలని మాజీ సైనికోద్యోగుల సంఘ ప్రతినిధులు కోరారు. గతేడాది డిసెంబర్ మాసాంతంతో 16 కేబీ, 32 కేబీ ఈసీహెచ్ఎస్ కార్డుల గడువు ముగిసిన నేపథ్యంలో పాత కార్డుల స్థానంలో 64కేబీ కార్డులను మార్చుకోడానికి వీలు కల్పించారని తెలిపారు. త్రివిధ దళాలకు చెందిన మాజీ సైనికులు, వితంతువులు, సైనికోద్యోగుల ఆధారిత కుటుంబ సభ్యులు పాత కార్డులను తక్షణం మార్చుకోవాలని కోరారు. మాజీ సైనికోద్యోగుల ఆధారిత కుటుంబ సభ్యుల్లో 18 సంవత్సరాలు నిండిన వారు ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని తెలియజేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


ఏటీఆర్ ట్రస్ట్ ద్వారా పెన్షన్ల పంపిణీ



బాలికలకు పింఛను అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ఆడారి తులసీరావు ట్రస్ట్(ఏటీఆర్) ద్వారా మంజూరు చేసిన పింఛన్లను జీవీఎంసీ 91, 92 వార్డుల్లో వారికి జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏటీఆర్ ట్రస్ట్ ద్వారా ఈ పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల వారు పింఛన్లు రావడం లేదని ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో స్పందించిన ఆయన తన సొంత నిధులు మంజూరు చేశారు. పాత గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఐకా లక్ష్మి, శ్రీజ, కోటేశ్వరరావు, 92వ వార్డు పరిధి ఆర్‌ఆర్‌వీ పురం ప్రాంతానికి చెందిన గంట్ల ప్రణీత శ్రీజ, ఇందిరానగర్‌కు చెందిన వి. రామశేఖర్, బంగారు శ్రీనులకు రూ. 2750 చొప్పున, సాయికుమార్, బి. శివప్రియలకు రూ1000 చొప్పున, వై హర్షవర్ధన్‌కు రూ.1500 అందించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, నాయకులు నీలాపు శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ, ఉష, నరసయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న లక్ష్మీగణపతి స్వామి



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు, ఆలయకమిటీ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు సంజీవయ్య నగర్‌లో వెలసిన లక్ష్మీగణపతి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు. గణపతి హోమంలో యువ నాయకుడు జియ్యాని విజయ్ పాల్గొన్నారు. స్థానికులు గురుమూర్తి, కేవీ రవిచంద్రల సౌజన్యంతో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారులు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

కంచరపాలెం : జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు కె.సుధ(టెక్నికల్), సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్)లు తెలిపారు. హోబిల్ బిలోస్ ఎంఎస్ఎన్ లేబరేటరీస్ హైదరాబాద్, హెటిరో, దక్కన్ ఫైన్ కెమికల్స్ తుని, మెడ్ ప్లస్ ఫార్మా విశాఖ, అనకాపల్లి, తమ్మినా సాఫ్ట్‌వైర్ సొల్యూషన్, టీజేఎల్ ఎన్‌డీటీ టెక్నాలజీస్‌తో పాటు పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 560 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 1,013 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 305 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, కె.సుధా చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

ప్రశాంతంగా పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష జరిగింది. జిల్లాలోని 24 కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 2,041 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో 1,708 మంది పరీక్షకు హాజరయ్యారు. 333 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.